
సాక్షి
ప్రకాశం
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025

వ్యసనాల వల..జీవితం సమాప్తం



యువకులు బెట్టింగ్‌ల ఊబిలో కూరుకు పోతున్నారు. బెట్టింగులకు అలవాటుపడి లక్షలు నష్టపోయి చివరకు అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. - 8లో..



'పోషణ్ పక్వాడా' విజయవంతం చేయాలి

పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. పౌష్టికాహార పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రెవెన్యూ సదస్సుల్లో సమస్యలపై దృష్టి పెట్టండి

- జిల్లా అధికారులను ఆదేశించిన సీసీఎల్‌ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాల కృష్ణ

ఒంగోలు సబర్బన్: గ్రామాల వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలపై దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించాలని సీసీఎల్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రధానంగా రీసర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్, పీజీఆర్‌ఎస్ పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సదస్సుల పీజీఆర్‌ఎస్, రీసర్వే, ఐవీఆర్‌ఎస్ ఫీడ్ బ్యాక్, వాటర్ ట్యాక్స్ తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. జిల్లాల్లో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్‌ఎస్ దరఖాస్తులు ఎస్‌ఎల్‌ఏ లోపు వెళ్లకుండా గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో వాటర్ ట్యాక్స్ వసూలు పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు మేలు

- పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ



టంగుటూరులో వేలం ప్రక్రియని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ

టంగుటూరు: పొగాకు బోర్డు అనుమతించిన మేరకే సాగు చేయడం మంచిదని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ అన్నారు. టంగుటూరు పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈడీ విశ్వ శ్రీ మాట్లాడుతూ రైతులంతా మార్కెట్ కు అనుగుణంగా పొగాకు తెచ్చుకొని అమ్మకాలు చేసుకోవాలన్నారు. మండెలలో మగ్గిన పొగాకునే బేళ్లు కట్టుకుని అమ్మకానికి తీసుకురావాలని తెలిపారు. రైతులు ఇప్పుడున్న మార్కెట్ ను చూసి ఖర్చులు పెంచుకోకుండా పొగాకు సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. అలాగే రైతులు తీసుకొచ్చిన బేళ్లన్నింటినీ నో బిడ్స్ లేకుండా కొనుగోలు చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. వేలం కేంద్రానికి కట్టుబడిపాలెం, కమ్మవారిపాలెం గ్రామాల రైతులు 435 బేళ్లు తీసుకొని రాగా అందులో 337 బేళ్లు కొనుగోలు చేశారు. రూ.263.30 సరాసరి ధర నమోదైంది. కార్యక్రమంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, సెక్రటరీ ఇన్‌చార్జ్ దివి వేణుగోపాల్, రీజినల్ మేనేజర్ ఎమ్.లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, బోర్డు సిబ్బంది, టంగుటూరు పొగాకు బోర్డు రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. యాప్ చిక్కుముడి!

అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు 2జీ.. అయితే రకరకాల యాప్‌లతో 5జీ పనులు చేయిస్తోంది. తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో కార్యకర్తలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఇటు అంగన్‌వాడీ కార్యకర్తలు.. అటు చిన్నారులు..లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తమపై ప్రభుత్వం పనిభారం పెంచి వేధింపులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- యాప్‌లతో అంగన్‌వాడీలపై పనిభారం
- సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా కొత్త యాప్‌లు
- బాలసంజీవని 2.0 వెర్షన్‌తో కొత్త ఇబ్బందులు
- పీడీ కార్యాలయంలో ఫోన్లు వెనక్కి ఇచ్చేసి నిరసన
- పీడీ ఆదేశాలతో ఫోన్లు బలవంతంగా వెనక్కి ఇస్తున్నారన్న ఆరోపణలు
- 5 జీ ట్యాబులు ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వ నిబంధనలతో నష్టపోతున్న చిన్నారులు..బాలింతలు



ఒంగోలు సిటీ: అంగన్‌వాడీలకు యాప్ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లు మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్‌కాక అవస్థలు పడుతున్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలంటూ ఒత్తిడి చేస్తుండడంపై కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచే వీరికి యాప్ ఇబ్బందులు ప్రారంభమవుతున్నాయి. తొలుత ఫేస్ యాప్ ఓపెన్ చేయాలి. అది ఓకే అయితేనే మిగిలిన యాప్‌లు పనిచేస్తాయి. విధిగా ఉదయం 9 గంటలకు సాయంత్రం 4 గంటలకు ఫేస్ యాప్‌వేయాలి. అలాగే వచ్చిన వెంటనే పిల్లల హాజరు ఫొటో తీయాలి.. ఎంత మంది హాజరైతే అంత మందికి మాత్రమే ఆహారం ఇవ్వాల్సి ఉంటుంది. చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల వరకూ పిల్లలు వస్తూనే ఉంటారు. ఆ తర్వాత వచ్చిన వారికి ఆహారం ఇచ్చే అవకాశం లేదు. ఇలా అందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఇది అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడంలేదని వారు వాపోతున్నారు. ఇక ఫేస్ యాప్ వేసిన రోజులకే వేతనం ఇస్తోంది. సాంకేతిక సమస్య తలెత్తితే ఆరోజు వేతనం కట్ చేస్తున్నారు. గౌరవ వేతనం ఇస్తున్న తమపై ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా నిబంధనలు విధించడం సరికాదని వారు మండిపడుతున్నారు.

పనిభారంతో అవస్థలు

ప్రభుత్వం కోరిన సమాచారాన్ని యాప్‌ల ద్వారా ఇవ్వడం, రికార్డులు రాయడం, టేక్ హోమ్ రేషన్ పంపిణీ, ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు పిల్లల బరువును పరిశీలించడం వంటి విధులు నిర్వహిస్తున్నప్పటికీ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా తమ పై వేసి అదనపు భారాన్ని మోపుతున్నారని అంగన్‌వాడీ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకు ఇస్తున్నది రూ.11,500 గౌరవ వేతనమేనని, ప్రభుత్వ ఉద్యోగులు చేసే పనిని తమతో చేయిస్తున్నప్పటికీ వేతనాలు మాత్రం సమానంగా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన బాలసంజీవని యాప్‌ను సవరణ చేయాలని, ఉద్యోగులతో పాటు తమకు సమాన వేతనాలు ఇవ్వాలని, పింఛన్ల పంపిణీ కార్యక్రమం నుంచి తమను మినహాయించాలని, పనిభారాన్ని తగ్గించాలని వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. ఆధునిక టెక్నాలజీతో కూడిన 5 జీ ట్యాబ్‌లను అందజేయాలని కోరుతున్నారు. హెల్పర్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని శుభ్రం చేయడం, ప్రీస్కూల్ విద్యార్థులకు పోషకాహారం వండి పెట్టడం, గిన్నెలు శుభ్రం చేయడం, పిల్లల వాష్‌రూమ్స్ శుభ్రం చేయడం వంటి పనులు చేస్తున్నా వీరికి కేవలం రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **బెదిరింపులు కాదు..**
> తాము ఎవరినీ బెదిరించలేదు. కార్యకర్తలు తమ ఫోన్లు తీసుకుని వెళ్లి వారి పనులు వారు చేసుకుంటున్నారు. వారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాను.
> – హేనా సుజన్, పీడీ, ఐసీడీఎస్, ఒంగోలు



సెక్టార్లలో అంగన్‌వాడీ వర్కర్లకు ఫోన్లు ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బాల సంజీవని 2.0తో

పోషణ ట్రాకర్, ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేస్తున్నారు. వాస్తవానికి లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్ చేసి సరుకులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఫోన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినా, నెట్‌వర్క్ లేకపోయినా లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్ కాకపోయినా సరుకులు ఇవ్వడం కుదరడం లేదని అంగన్‌వాడీ వర్కర్లు అంటున్నారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన అన్నీ ఫోన్లలో కొన్ని యాప్‌లు ఇన్‌స్టాల్ కావడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా బాల సంజీవని 2.0 వెర్షన్‌తో కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో వర్కరు, హెల్పరు ఫొటో క్యాప్చర్ చేసి గర్భిణులకు, బాలింతలకు 7–3 , 3–6 వయస్సున్న చిన్నారులకు బాల సంజీవని పంపిణీ చేయాలి. అయితే తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో పోషకాహారం పంపిణీలో నానా ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా యాప్‌లు తెచ్చి తమను ఇబ్బందులను గురి చేయడమే కాక, అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రకు కూటమి ప్రభుత్వం తెరతీసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో పనికి మూడు యాప్‌ల్లో వివరాలు అప్లోడ్ చేయాల్సి వస్తోంది. ఇవి సాంకేతిక సమస్యలతో పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో ఏర్పడుతున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్ణయించారు.

ఫోన్లు ఇచ్చేసి నిరసన..



సెల్ ఫోన్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు (ఫైల్)

మారుమూల ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ కష్టాలు అధికంగా ఉండడంతో కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. అన్ని యాప్‌లను కలసి ఒక యాప్‌గా చేస్తామని చెప్పి తమను పట్టించుకోవడంలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుండా యాప్‌ల పేరుతో ఇబ్బందులు గురిచేస్తుండడంతో ఐదు రోజుల కిందట అంగన్‌వాడీ కార్యకర్తలు తమ ఫోన్లను ఒంగోలు పీడీ కార్యాలయంలో ఇచ్చి తమ నిరసనను తెలియజేసి వెళ్లిపోయారు. అయితే పీడీ ఆదేశాల మేరకు సూపర్‌వైజర్లు, సీడీపీవో ప్రాజెక్టుల వారీగా అంగన్‌వాడీ వర్కర్లకు ఫోన్లను బలవంతంగా ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే కార్యకర్తలు ఆ ఫోన్లను వినియోగించడంలేదని తెలిసింది.

> **పనిచేయని ఫోన్లతో ఎలా ..**
>
> 
>
> సక్రమంగా పనిచేయని ఫోన్లతో ఎలా పనిచేయాలో ప్రభుత్వమే చెప్పాలి. కొత్తగా ప్రవేశపెడుతున్న బాలసంజీవని 2.0 వెర్షన్ ప్రస్తుతం మా వద్ద ఉన్న ఫోన్‌లలో పనిచేయదు. నెట్‌వర్క్ సక్రమంగా ఉండటం లేదు. ప్రకాశం జిల్లాలో 13 ప్రాజెక్టులు ఉంటే అందులో 7 ప్రాజెక్టులు ట్రైబల్ ఏరియా కావడం వల్ల సిగ్నల్ ఉండక అంగన్‌వాడీ వర్కర్లు నానా అవస్థలు పడుతున్నారు. ఇంటర్నెట్ సదుపాయం లేకపోతే యాప్‌లు ఓపెన్ కావు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించడంతో పాటు కొత్తగా 5 జీ ట్యాబ్‌లను ఇవ్వాలి. పగలు స్కూల్‌లో పని, రాత్రి యాప్‌లతో పనిచేయాల్సి వస్తోంది. ఇన్ని ఇబ్బందులతో పనిచేయడం కష్టంగా ఉంది. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంతో పాటు కొత్త ట్యాబ్‌లను సమకూర్చాలి.
> – ఈదర అన్నపూర్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఒంగోలు

సీబీజీ భూముల కేటాయింపులో అత్యుత్సాహం

- ఆ భూములు మావంటే మావని ప్రభుత్వ శాఖల పోట్లాట
- రెవెన్యూ–అటవీ శాఖల మధ్య తారస్థాయికి చేరుకున్న వివాదం
- రెండు రోజులుగా నిలిచిపోయిన ప్లాంట్ పనులు



అటవీ, రెవెన్యూ అధికారుల చర్చలు

కురిచేడు: రిలయెన్స్ బయోగ్యాస్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులు చేసిన హడావుడి భూ వివాదాలకు దారి తీసింది. కురిచేడు మండలంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ (సీబీజీ) ఏర్పాటు కోసం 799.40 ఎకరాల భూమిని కేటాయించారు. అయితే ఈ భూమి రెండు శాఖల మధ్య వివాదాన్ని రేపింది. ఆ భూములు మావంటే, మావని రెండు శాఖల అధికారులు పోట్లాడుకుంటూ పనులు నిలిపేశారు. మంగళవారం తహసీల్దార్ రజనీకుమారి, ఆర్‌ఐ నాగరాజు, సర్వేయర్ గోపి, వీఆర్వో హనుమంతరావు, ఫారెస్ట్ రేంజర్ నరసింహారావు, బీట్ అధికారి ధనలక్ష్మి, సిబ్బంది సీబీజీకి కేటాయించిన భూముల విషయంపై ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డులు పరిశీలించి చర్చలు జరిపారు. అయితే ఈ భూమి కచ్చితంగా ఎవరదనేది తేల్చలేకపోయారు.

50 ఏళ్లుగా రెండు శాఖల మధ్య వివాదం..

దొనకొండ, కురిచేడు మండలాల సరిహద్దులో అటవీశాఖకు (రిజర్వు ఫారెస్టు) దొనకొండ మండలం బాదాపురం వద్ద నుంచి కురిచేడు మండలం గుండ్లకమ్మ వాగు వరకు పొట్లపాడు బీటు కింద సుమారు 13 వేల ఎకరాల అటవీభూమి ఉంది. కాల క్రమంలో హద్దులు చెరిగిపోయాయి. వాటిని జాయింట్ సర్వేచేసి హద్దులు నిర్ణయించుకోవాల్సి ఉంది. ఈ విషయంపై ఆ రెండు శాఖలు పూర్తి స్థాయిలో ఆదిశగా ప్రయత్నాలు చేయలేదు. 50 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సమస్య ఇరు శాఖలకు తలనొప్పిగా మారింది. ఇలా భూములు కేటాయించాల్సి వచ్చినప్పుడు మాత్రమే ఇరుశాఖలు పోట్లాడుకోవటం, తరువాత ఎవరికి వారు మిన్నకుండిపోవటం జరుగుతూ వస్తోంది.

ఆదాయ వనరుగా వివాదాస్పద భూమి

రెవెన్యూ–అటవీశాఖల మధ్య వివాదాస్పదంగా మారిన భూ వివాదం రెండు శాఖల్లోని కొందరు అధికారులకు ఆదాయ వనరుగా మారింది. రెండు శాఖల్లోని కొందరి అధికారుల కనుసన్నల్లో భూములు ఆక్రమించుకుని సాగుచేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది అయితే అధికారుల సాయంతో నకిలీ పట్టాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించి మరీ ఆ భూములను విక్రయించి సొమ్ము చేసుకున్నారని సమాచారం.

సీబీజీకి కేటాయించడంతో మళ్లీ తెరపైకి భూ వివాదం..

తాజాగా మండలంలోని గంగ దొనకొండ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 88, 90 లలోని 799.40 ఎకరాల భూమిని తాజాగా రెవెన్యూ అధికారులు సీబీజీ కి కేటాయించి నిర్మాణ సంస్థకు అప్పగించారు. అయితే ఆ భూములు అప్పగించే ముందు దానిని సర్వేచేయకుండా, ఆ భూముల్లోని పట్టాదారులకు సమాచారం ఇవ్వకుండా కేవలం రికార్డులు చేసి అత్యుత్సాహం ప్రదర్శించారు. భూములను చదును చేసే క్రమంలో అటవీశాఖ అధికారులు ఆ భూములు మావి అంటూ చదును చేయకుండా అడ్డుకున్నారు. రెండు రోజులుగా కేటాయించిన స్థలంలో పనులు ఆగిపోయాయి. ఇరు శాఖల ఉన్నతాధికారులు చేరి రికార్డులు పట్టుకుని తిరుగుతున్నారే తప్ప ఆ భూమి ఎవరిది అనేది తేల్చకపోవటం విశేషం.

ఉద్యోగులతో ఉపాధి పనులా..!



సోషల్ ఆడిట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

- పీడీ తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలు

యర్రగొండపాలెం: గ్రామాల్లో చిరుద్యోగాలు చేసుకునేవారి పేర్లతో ఉపాధి హామీ పనులు చేసినట్లు మస్టర్లు వేసుకున్నట్లు మంగళవారం జరిగిన సోషల్ ఆడిట్‌లో గుర్తించారు. ఆయా ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ ఆయాలు, ఇతర ఉద్యోగుల పేర్లు నమోదు చేసుకొని ఉపాధి నిధులు దుర్వినియోగం చేశారని డ్వామా పీడీ జోసఫ్ కుమార్‌కు ఆడిట్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. అనేక ప్రాంతాల్లో నాటుకున్న మొక్కలు ఎండిపోయాయని, కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నాయని వారు ఆరోపించారు. ఈ మేరకు రికార్డు చేసిన పీడీ ఉపాధి సిబ్బందిని మందలించారు. మండలంలో ఉపాధి, ఐటీడీఏ, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో దాదాపు రూ.28 కోట్ల పనులు జరిగినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ కోటేశ్వరరావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బంది ద్వారా సేకరించిన రూ.1.50 లక్షలు, తన సొంత నిధులు రూ.10 వేలు మృతుడి పిల్లలకు అందజేశారు. కాశికుంట తండాలో నిర్మిస్తున్న పశువుల నీటి తొట్టిని ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలోని ఉపాధి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ వెంకటేశ్వర్లు, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రసాద్, ఏపీవోలు కె.నాగేశ్వరరావు, ఎం.శైలజ పాల్గొన్నారు.

హామీల్లో సిక్సర్‌లు.. అమలులో జీరోలు

- చంద్రబాబు సూపర్ సిక్స్ అమలు చేయలేనని చేతులెత్తి డకౌట్ అయ్యాడు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, అన్నా రాంబాబు

దర్శి: చంద్రబాబు ఎన్నికల ముందు ఓట్ల కోసం హామీలు ఇవ్వటంలో సిక్సర్‌లు కొట్టి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారని.. తీరా హామీలు అమలు చేయడంలో జీరోలు అయ్యారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని రాజంపల్లి మూసీ నది ఒడ్డున ఉన్న సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా పొదిలి మండలం కుంచేపల్లి గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు తో పాటు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారిని ప్రభ నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు అలవి కాని హామీలు ఇచ్చి ఆ తరువాత ఒక్కటీ అమలు చేయకుండా నాలుక మడతేయడంలో చంద్రబాబు ఆరి తేరారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ''ఇప్పుడు పథకాలు చూస్తే భయమేస్తుంది.. నేను అమలు చేయలేనని'' చేతులెత్తి తూర్పు తిరిగి దణ్ణం పెడుతున్నారన్నారు. ఇటీవల ప్రకృతి వైపరీత్యాలకు రైతులు తీవ్రంగా నష్టపోతే వారికి రూపాయి కూడా విదల్చలేదన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు రాష్ట్రానికి అవసరం

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు రాష్ట్రానికి ఎంతో అవసరం ఉందని బూచేపల్లి అన్నారు. అప్పుడే రాష్ట్రంలో పేదలకు సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. పాలన అంటే జగనన్నను చూసి నేర్చుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టించామన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమం అటకెక్కించారని, అభివృద్ధి పూర్తి గా కుంటుపడిందని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు కేవీ రమణారెడ్డి, పేరం సుభాష్ చంద్రబోస్ రెడ్డి, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ రవాణా చేస్తున్న 3 లారీలు పట్టివేత



పట్టుబడిన లారీలు

చీమకుర్తి రూరల్: మండలంలోని రామతీర్థం నుంచి బూదవాడ వైపు గ్రానైట్ ముడి రాళ్లు అక్రమ రవాణా చేస్తున్న 2 లారీలు, ఒక టిప్పర్‌ను సేల్‌టాక్స్ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. దాడుల్లో పట్టుకున్న లారీలను ఏపీఎండీసీ ప్రాంగణానికి తరలించారు.

పూరి గుడిసె దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన పూరిల్లు

యర్రగొండపాలెం: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూరి గుడిసె దగ్ధమైన సంఘటన యర్రగొండపాలెం మండలంలోని అయ్యంబొట్లపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పూజల సత్యనారాయణ కుటుంబం పనుల నిమిత్తం బయటికి వెళ్లిన సమయంలో ఇంటికి నిప్పంటుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో దాదాపు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపు చేశారు.

హౌరా జనరల్ కోచ్‌లో గుర్తు తెలియని మృతదేహం



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఒంగోలు టౌన్: ఒంగోలు రైల్వే స్టేషన్‌లో ఫస్ట్ ప్లాట్‌ఫాంపై హౌరా ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుంది. పీచ్‌కలర్ రౌండ్ నెక్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. కుడి చెంప, ఛాతీ మీద పుట్టుమచ్చలు ఉన్నాయి. రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు జీఆర్పీ ఎస్సై కె.మధుసూదన రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627647ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



వర్ధన్ మృతదేహం

టంగుటూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వల్లూరు జాతీయ రహదారిపై సోమవారం అర్ధ రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు..మండలం లోని టంగుటూరు బాపూజీ కాలనీకి చెందిన సవలం వర్ధన్(24) ఒంగోలులో ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తుంటాడు. సోమవారం రాత్రి ఆస్పత్రిలో పని ముగించుకొని ఇంటికి వస్తుండగా వల్లూరు సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి ఎస్సై చేసుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

మేలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో మేలో నిర్వహించనున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి డి.సోమసుందర్ కోరారు. మంగళవారం స్థానిక మల్లయ్యలింగం భవనంలో నిర్వహించిన రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలులో మూడోసారి నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు సభ్యులు కృషి చేయాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్, ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఆలపాటి సురేష్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఎ.సురేష్, డి.కనకయ్య, వెంకటేశ్వర్లు, భక్తవత్సలం, కేవీ సురేష్ రెడ్డి, సీహెచ్ రాంబాబు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యసనాల వల.. జీవితం.. సమాప్తం..!



దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉంది. కానీ నేడు అదే యువత పెడదారి పెట్టి జీవితాన్ని అర్ధంతరంగా ముగించేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ ప్రపంచంలో ఎవరు ఏం చేస్తున్నారో అర్థం చేసుకునే లోపే రెండు పదుల వయసు నిండకుండానే అప్పుల భారం భరించలేక ఆత్మహత్యలతో జీవితం సమాప్తమైపోతుంది. వ్యసనాలకు, స్మార్ట్ ఫోన్‌లకు, సరదాలకు బానిసై కొందరు జీవితాలను నాశనం చేసుకుంటుండగా..మరి కొందరు ప్రమాదాల ఉచ్చులో చిక్కుకుని విగతజీవులుగా మారి కన్నవారికి గర్భ శోకం మిగులుస్తున్నారు.

- పక్కదారి పడుతున్న యువత
- బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయి అర్ధాంతరంగా తనువు చాలింపు
- యువతను కబళిస్తున్న స్మార్ట్ ఫోన్లు
- తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడడమే కారణం

కనిగిరిరూరల్: స్మార్ట్ ఫోన్ ప్రపంచం యువతను కబళిస్తోంది. అరచేతిలోకి ప్రపంచాన్ని తీసుకువచ్చిన స్మార్ట్‌ఫోన్..అదే అరచేతితో యువతకు ఆర్థాయుష్షు పోస్తోంది. వెల్లువెల్లా వచ్చిపడుతున్న యాప్‌ల్లో బందీలవుతున్న యువత అందులోకి బయటకు రాలేక విలవిలలాడిపోతున్నారు. కళ్లెదుటే తిరుగుతున్న కన్నపిల్లలు అర్ధాంతరంగా ఎందుకు చనువు చాలిస్తున్నారో తెలియని తల్లిదండ్రులకు గుండెకోతే మిగులుతోంది.

బెట్టింగ్ వల..ప్రాణాలు విలవిల

బెట్టింగ్ యాప్‌లు యువత ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. గడిచిన ఏడాది కాలంలో బెట్టింగ్ యాప్‌లకు ఐదుగురు బలి కాగా. మరో పది మందికి పైగా ఆత్మహత్యాయత్నం చేశారు.

- బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లో అప్పుల పాలయ్యాడు. నగలు, ఆస్తులు అమ్ముకున్నాడు.
- బయట ప్రాంతంలో ఉన్నత చదువులు చదువుతున్న కనిగిరికి చెందిన ఓ విద్యార్థిని స్మార్ట్ ఫోన్ యాప్ గేమ్ ఉచ్చులో చిక్కుకుని ఆత్మహత్య చేసుకుంది.
- పట్టణంలోని కొత్తపేటలో ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లో అప్పుల పాలై ఊరు వదిలి వెళ్లి పోయాడు.
- మండలంలోని అడ్డ రోడ్డు ప్రాంతంలో ఇద్దరు విద్యార్థులు బెట్టింగ్ యాప్ ఉచ్చులో చిక్కుకొని నిద్రమాత్రలు మింగారు. అదృష్టవశాత్తు తల్లిదండ్రులు సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలు మిగిలాయి.
- బొడ్డు చావిడి ఏరియాకు చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ జూదంలో రూ.50 లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలై.. ఊరొదిలి వెళ్లి.. అక్కడ కూడా వ్యసనాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- తాజాగా ఓ విద్యార్థి బెట్టింగ్ యాప్‌లో నగదు పోగొట్టుకొని ఇంట్లో వాళ్లు కొడతారని భయపడి ఉరి వేసుకున్నాడు. బయట ప్రపంచానికి తెలిసిన కొన్ని. బయటకు రాకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి తనువు చాలిస్తున్న ఎందరివో బయటకు రానివి ఉన్నాయి.

అతివేగంతో అనంత లోకాలకు..

తల్లిదండ్రుల అతి గారాబంతో పిల్లలకు చిన్న వయసులోనే ద్విచక్రవాహనాలు ఇవ్వడంతో వారు అతి వేగంగా ప్రయాణించి ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు అనేకం. గత వారంరోజుల్లో కనిగిరి, మార్కాపురం, దొనకొండ ప్రాంతాల్లో ద్విచక్రవాహన ప్రమాదాలు ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల నూతన చట్టం అమల్లోకి రావడంతో మైనర్లు వాహనం నడిపినప్పుడు ప్రమాదం జరిగి వ్యక్తి మరణిస్తే వాహన యజమాని, మైనర్‌తో పాటు, తల్లిదండ్రులు కూడా శిక్షకు గురవుతారు. ఈ చట్టం ప్రకారం మైనర్ తల్లిదండ్రులు, వాహన యజమానులు గరిష్టంగా మూడేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉంది.

కొరవడిన తల్లిదండ్రుల పర్యవేక్షణ

తమ పిల్లలు ఏం చేస్తున్నారనే తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో యువత పక్కదారి పడుతున్నారు. ఏదో ఒక సాకుతో నిత్యం మత్తుకు బానిసలవుతున్నారు. ఎంజాయ్ ముసుగులో చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పోలీసులకు అత్యధికంగా యువతే పట్టుబడుతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇటీవల 18 నుంచి 25 ఏళ్ల లోపు వారే ఎక్కువగా ఉండటం ఆందోళన కల్గిస్తోంది. బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో చిక్కుకున్న యువత వాటి నుంచి బయటకు రాలేక, తల్లిదండ్రులకు చెప్పుకోలేక అర్ధాంతరంగా చనువు చాలిస్తున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రుల తమ పిల్లలు ఏం చేస్తున్నారన్నది పర్యవేక్షించాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు సూచిస్తున్నారు.

‘పోషణ్ పక్వాడా’ విజయవంతం చేయాలి



పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ తదితరులు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో 7వ పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 8 నుంచి 22 వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. లబ్ధిదారులు స్వయంగా తమంతట తామే పోషణ్ ట్రాకర్ లో నమోదు చేసుకునే విధానంపై ప్రచారం చేయటం, కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం (సీఎంఏఎం) అమలు చేయడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం నివారిస్తారన్నారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రక్తహీనత కలిగిన కిశోర బాలికలపై, హై రిస్క్ ప్రెగ్నెంట్స్, ఊబకాయ పిల్లలు, బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయడంతో పాటు పౌష్టికాహారం ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఐసీడీఎస్, విద్య, హెల్త్, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ హేన సుజన మాట్లాడుతూ 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. తొలుత పక్షోత్సవాల్లో రోజు వారీగా నిర్వహించే కార్యక్రమం వివరాలను ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి వివరించారు. ఈ సందర్భంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవాలకు సంబంధించి ప్రచురించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.వెంకటేశ్వర రావు, మెప్మా పీడీ శ్రీహరి, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హోరా హోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

అర్ధవీడు (కంభం): మండలంలోని నాగులవరం గ్రామంలో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పోటీల్లో రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన సూరా పూజితరెడ్డి ఎడ్లు 4500 అడుగుల దూరం బండలాగి ప్రథమస్థానంలో నిలిచి సత్తాచాటాయి. అక్కలరెడ్డి పల్లికి చెందిన కూతుళ్ల దక్షితరెడ్డి ఎడ్లు 4223 అడుగులు లాగి ద్వితీయ స్థానం, కంభం మండలం ఎల్‌కోటకు చెందిన ఉలవల హరికృష్ణ ఎడ్లు 4080 అడుగులు లాగి తృతీయ స్థానం, అర్ధవీడు మండలం గన్నేపల్లికి చెందిన డి.ఖాసింవలి ఎడ్లు 4059 అడుగులు లాగి నాల్గవ స్థానం, గన్నేపల్లికి చెందిన భూపని గురవయ్య ఎడ్లు 3726 అడుగులు లాగి ఐదో స్థానం, కనిగిరికి చెందిన సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3 వేల అడుగులు లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు. దండుగ వెంకటరెడ్డి, పిడుగు రవికుమార్‌రెడ్డి, రామిరెడ్డి నారాయణరెడ్డి, బాల సుబ్బారెడ్డి, తదితరులు బహుమతులకు ఆర్థిక సహకారం అందించారు.

17 వరకు ఈ శ్రమ్‌లో కార్మికుల నమోదు

ఒంగోలు వన్‌టౌన్: అసంఘటిత రంగ కార్మికులు, ప్లాట్‌ఫాం కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఉప కార్మిక శాఖ కమిషనర్ ఎ.గాయత్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. డెలివరీ బాయ్స్ ప్లాట్‌ఫారం కార్మికుల విభాగం కిందకు వస్తారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకాల ద్వారా కార్మికులు ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న కార్మికులు తమ ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబర్ కలిగిన ఫోన్‌తో ఒంగోలులోని కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే 9581433338కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

సంపన్నులకు వరాలు.. సామాన్యులపై భారాలు



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ఒంగోలు టౌన్: కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టే నాటికి రూ.450గా ఉన్న వంట గ్యాస్ ధర ప్రస్తుతం రూ.900కు చేరుకుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి విమర్శించారు. అసలే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో వంటగ్యాస్ ధర మరో రూ.50 పెంచడం దారుణమని మండిపడ్డారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్బీజీ భవనంలో నిర్వహించిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత సంపన్నులకు వరాలు ప్రకటిస్తూ సామాన్యులపై భారాలు మోపుతోందని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామన్న మోదీ మాటలకు చేతలకు పొంతన లేదని దుయ్యబట్టారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి దీటుగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ప్రజల నెత్తిన ధరల భారం మోపుతోందని విమర్శించారు. వంట గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జి.ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎన్.మాలతి, ఎస్‌కే నాగుర్‌బీ, కె.రాజేశ్వరి, కె.లక్ష్మీ ప్రసన్న, బి.రాజ్యలక్ష్మి, బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

- రూ.69,120 నగదు స్వాధీనం

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల గ్రామ పరిధిలో పేకాట శిబిరంపై ఎస్సై అనిల్‌కుమార్ మంగళవారం దాడి చేశారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.69,120 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మహిళా విభాగం ఎన్నిక

జిల్లా చైర్‌పర్సన్‌గా కాట్రగడ్డ రజిత మానస



మాట్లాడుతున్న రజిత మానస

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్‌గా డాక్టర్ కాట్రగడ్డ రజిత మానసను ఎంపిక చేసినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా మహిళా విభాగం ఏర్పాటుపై కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా వనజ, ట్రెజరర్‌గా ప్రసన్నను ఎంపిక చేసినట్లు తెలిపారు. కో చైర్మన్లుగా శ్రీదేవి, గౌరి, అనుపమ, గురుదేవి, సునీత, కో కన్వీనర్లుగా సుజాత, నాగమణి, త్రివేణి, ప్రసన్న, జి.సుజాత, ప్రతిమ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా విభాగం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ శాఖల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వరకుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు మోటూరు శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా అధ్యక్షుడు సురేష్ బాబు, గోపీకృష్ణ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీసీఏ జిల్లా అధ్యక్షుడిగా అజయ్ కుమార్



గేరా అజయ్‌కుమార్

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏపీటీసీఏ) నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఆర్కిడ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ గేరా అజయ్ కుమార్ ఎన్నికైనట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏపీటీసీఏ) రాష్ట్ర నాయకులు, ఎన్నికల పరిశీలకులు మాంటిస్సోరి ప్రకాష్ బాబు మంగళవారం ప్రకటించారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు, ఎన్నికల పరిశీలకుడు మాంటిస్సోరి ప్రకాష్ బాబు మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ అధ్యక్షుని ఎన్నికకు ఈనెల రెండో తేదీ నుంచి ఆరో తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగిందని ఈ నామినేషన్ ప్రక్రియలో ఆర్కిడ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ గేరా అజయ్ కుమార్ ప్రకాశం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఆయనకు రాష్ట్ర ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ తరఫున ప్రకాష్ బాబు అభినందనలు తెలియజేశారు. త్వరలోనే నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఐపీపీ కృష్ణసాయి హైస్కూల్ కరస్పాండెంట్ పిడుగు జాలిరెడ్డి అధ్యక్షత వహించగా, పూర్వ జిల్లా అధ్యక్షుడు ఆంధ్ర హైస్కూల్ కరస్పాండెంట్ బీ శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గేరా అజయ్ కుమార్‌కు జిల్లాలోని పాఠశాలల కరస్పాండెంట్లు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

రైలు ఢీకొని ఆర్మీ రిటైర్డు జవాన్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

టంగుటూరు: రైలు ఢీకొని ఆర్మీ రిటైర్డు జవాన్ మృతి చెందాడు. ఈ సంఘటన టంగుటూరు సెంటర్లో రైల్వే గేటు వద్ద మంగళవారం ఉదయం జరిగింది. గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కొండపి గ్రామానికి చెందిన గడ్డిపాటి శ్రీనివాస్ ఆర్మీలో పనిచేస్తూ 2018లో రిటైర్డు అయ్యారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే శ్రీనివాస్ తల్లిదండ్రులు టంగుటూరులో నివాసం ఉంటున్నారు. వారిని చూసేందుకు రెండు రోజుల క్రితం టంగుటూరు వచ్చాడు. అయితే మంగళవారం ఉదయం టీ తాగేందుకు టంగుటూరు సెంటర్‌కు వస్తున్న క్రమంలో రైల్వేగేట్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. ప్రమాదంలో శరీర భాగాలు ముక్కలయ్యాయి. సంఘటనా స్థలానికి రైల్వే పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా ఈ నెల 20న నెల్లూరు రైల్వేస్టేషన్‌లో గార్డుగా విధుల్లో చేరాల్సి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

తండ్రి చేతిలో కొడుకు హతం

- భార్యను కత్తితో పొడవబోయి అడ్డొచ్చిన కొడుకును పొడిచి..
- మద్యం మత్తులో దారుణం



షాకీర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అర్ధవీడు(కంభం): మద్యం మత్తులో భర్త..భార్యపై దాడి చేస్తుండగా కుమారుడు అడ్డు రాగా కత్తి పోటుకు గురై మృతి చెందిన సంఘటన అర్ధవీడులో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు మద్యానికి బానిసైన షేక్ ఖాసిం వలి తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి కత్తితో ఆమెపై దాడి చేస్తుండగా కొడుకు షాకీర్ (14) అడ్డు రాగా అతను కత్తిపోటుకు గురై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఘర్షణ అనంతరం మృతుడి తల్లి, సోదరి కలిసి మద్యం మత్తులో ఉన్న ఖాసీంవలిపై దాడి చేశారు. అతన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. షాకీర్ మృతదేహం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో ఉంది.

అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలి

- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో(పీజీఆర్‌ఎస్) వచ్చిన వినతులను పెండింగ్ లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఆర్‌ఎస్‌పీడీలు, మండల సర్వేయర్లతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీజీఆర్‌ఎస్ వినతుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వే, నీటిపన్ను, పీజీఆర్‌ఎస్ గ్రీవెన్స్, 22ఏ పెండింగ్ దరఖాస్తులు, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై మండలాల వారీగా తహసీల్దార్లతో సమీక్షించారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియలో తప్పులు దొర్లకుండా, పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నీటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల విస్తృత దాడులు

- 119 కేసుల్లో రూ.5,98,750 జరిమానా

ఒంగోలు సబర్బన్: విద్యుత్ విజిలెన్స్, విద్యుత్ అధికారులు ఒంగోలు నగరంలో మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా 119 కేసులు నమోదు చేసిన రూ.5,98,750 అపరాధ రుసుం విధించారు. ఒంగోలు డివిజన్ నుంచి 40 మంది బృందాలుగా ఏర్పడి దాడులు చేశారు. దాడుల్లో 3020 సర్వీసులను తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్ కింద 22 కేసులు నమోదు చేసిన అధికారులు రూ.95వేలు, అడిషనల్ లోడ్‌కు సంబంధించి 97 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ. 5,03,750 అపరాధ రుసుం విధించారు. దాడుల్లో ఒంగోలు ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ మాకినేని హరిబాబు, డీపీఈ ఈఈ టి.హైమావతి, ఒంగోలు డీఈ కేవీ.పాండురంగారావు, డీపీఈ డీఈ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.